



తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుడి చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com





తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 222 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ శనివారం- 11 - జులై - 2026

Published From Kurnool : Circulated at `Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,


## సుప్రీంకోర్టులో ఊహించని ఘటన.. న్యాయమూర్తులపై ఆగ్రహించిన పిటిషనర్..



- సుప్రీంకోర్టులో ఇవాళ (శుక్రవారం) అనూహ్య పరిణామం చోటుచేసుకుంది.
- ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు.
- దీంతో కోర్టు హాలులో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో ఇవాళ (శుక్రవారం) అనూహ్య పరిణామం చోటుచేసుకుంది.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్..
# 32 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

- కరూర్ తొక్కిసలాట బాధితులకు నియామక పత్రాలు అందించిన ముఖ్యమంత్రి
- బాధితుల కష్టాలు చూసి భావోద్వేగానికి గురైన ముఖ్యమంత్రి
- బాధితుల స్మారకార్థం మెమోరియల్ నిర్మిస్తామని ప్రకటన
- కొనసాగుతున్న సీబీఐ విచారణ, ప్రతిపక్షాల విమర్శలు



ఢిల్లి : గతేడాది టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబాలను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పరామర్శించారు. ఈ దుర్ఘటన జరిగి దాదాపు ఏడాది పూర్తవుతోంది. ఈ తరుణంలో, శుక్రవారం ఆయన కరూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బాధితుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను ఆయన స్వయంగా అందజేశారు. కరూర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, బాధిత కుటుంబాల్లోని అర్హులైన 32 మందికి వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను కేటాయించారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు ఎస్పీ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో నియామకాలు జరిగాయి. మిగతా..2లో

## భారత తొలి హైడ్రోజన్ ట్రైన్ కు
# రైల్వే శాఖ ఆమోదం

- 74010/74009 రైలు నంబర్లతో ఈ సర్వీసు నడుస్తుందని రైల్వే వర్గాల వెల్లడి
- జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల సరసన భారత్



ఢిల్లి : భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలు త్వరలోనే పట్టాలు ఎక్కనుంది. జింద్-సోనిపత్ మధ్య డైలీ హైడ్రోజన్ రైలు సర్వీసును ప్రవేశపెట్టడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సంబంధిత వర్గాలు తెలిపాయి. 74010/74009 రైలు నంబర్లతో ఈ సర్వీసు నడుస్తుందని చెప్పాయి. జింద్ సిటీ, పాండు పిండారా, లలిత్ ఖేడా, భంబేవా, ఇషాపుర్ ఖేరి, బుటానా, ఖంద్రాయ్, గోహానా, రభ్రా, లాత్, మోహనా, హరియాణా, బర్వాస్ని స్టేషన్లలో వాణిజ్యపరమైన స్టాపులు ఉంటాయని వర్గాలు పేర్కొన్నాయి. హైడ్రోజన్ రైలు రవాణాను వినియోగిస్తున్న జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల సరసన భారతదేశం చేరనుంది. ఇప్పటికే జూన్‌లో దిల్లీ- జింద్ మధ్య హైడ్రోజన్ మిగతా..2లో

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం



- పదేళ్ల అధికారంలో ఉన్న హరీశ్ రావు కుంగిపోయే ప్రాజెక్టులు కట్టారన్న మహేశ్ గౌడ్
- ఇప్పుడు ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ఈటల బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా ఉందని ఎద్దేవా

హైదరాబాద్: హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రతిపక్షాలపై విమర్శల జడివాన కురిపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల అధికారంలో ఉండి కుంగిపోయే ప్రాజెక్టులు కట్టిన మీరు...

## వ్యవసాయం దండగ కాదు..
# పండుగ చేయడమే మా లక్ష్యం

- రైతుల కళ్లల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం
- జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభ
- రూ. 1009.15 కోట్ల రైతు భరోసా విడుదల సీఎం రేవంత్ రెడ్డి.




హైదరాబాద్/ఖమ్మం, జులై 10 ( వార్త నిర్భయం) రాష్ట్రంలోని రైతుల కళ్లల్లో ఆనందమే ప్రజా ప్రభుత్వానికి అసలైన ఆశీర్వాదమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. "వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేయడమే మా లక్ష్యం అని స్పష్టం చేశారు.గడిచిన 9 రోజుల్లో రూ. 9,000 కోట్లు మేరకు 73.30 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా చెల్లించిన సందర్భంగా ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలి గ్రామంలో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహించారు. సభా వేదికగా చివరి విడతగా 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 1009.15 కోట్లు విడుదల చేయడంతో పాటు ఈ-పట్టాదారు పాసుపుస్తకాల జారీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు.

### 30 నెలల్లో రైతులపై రూ. 1.70 లక్షల కోట్ల ఖర్చు

సభలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి, రైతులను రాజును చేయాలన్న ఆలోచనతోనే గడిచిన 30 నెలల్లో వ్యవసాయ రంగంపై రూ. 1 లక్ష 70 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. రైతు భరోసా కింద 30 నెలల్లో రూ. 36,135 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, గత ఏడాది జూన్‌లోనూ 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేసినట్లు గుర్తు చేశారు. "ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదు. రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే మా ఆశయం" అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, బీమా, గిట్టుబాటు ధర, సన్నవడ్లకు బోనస్, ఉచిత కరెంట్, నష్టపరిహారంలి వంటి అన్ని సంక్షేమ పథకాల కోసం ప్రతి నెలా సగటున రూ. 5,500 కోట్లులి ఖర్చు చేస్తున్నామని వివరించారు.

### గత పథకాలు కొనసాగిస్తూ కొత్త సంక్షేమం

## టీఆర్ఎస్‌ను గెలిపిస్తే.. రైతును
# రాజును చేసి చూపిస్తా



- తెలంగాణలో ఆదివాసీకి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు.
- బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్..
- గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను ఆమె సూటిగా ప్రశ్నించారు.

అశ్వారావుపేట, జులై 10: ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేనను గెలిపిస్తే.. రైతును రాజును చేసి చూపిస్తా అని ప్రజలకు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేయిస్తామని తెలిపారు. త్వరలోనే మహిళల కోసం ఒక ప్రత్యేకమైన వినూత్న ఆలోచనను చేశానని చెప్పారు. దీనిని త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. అన్న రాజ్యం కాదు.. మిగతా..2లో

## జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి: గవర్నర్‌కు బొత్స లేఖ



- జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వేదికను మార్చొద్దన్న బొత్స
- విజయనగరం జిల్లాలోనే నిర్వహించాలని గవర్నర్‌కు విన్నపం
- విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో నిర్వహించాలనుకోవడం సరికాదని వ్యాఖ్య

అమరావతి: విజయనగరం జిల్లాలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం వేదికను మార్చాలన్న నిర్ణయంపై ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో కాకుండా విజయనగరంలోనే నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆయన ఒక లేఖ రాశారు. స్నాతకోత్సవానికి తనను ఆహ్వానించినందుకు గవర్నర్ కు బొత్స ధన్యవాదాలు తెలిపారు. "విజయనగరం లాంటి వెనుకబడిన జిల్లాలో విద్యా రంగాన్ని పరుగులు పెట్టించేందుకు మిగతా..2లో

## హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం.. డెకరేషన్ వస్తువుల గోదాంలో మంటలు



- హైదరాబాద్ చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అగ్నిప్రమాదం సంభవించింది.
- చాదర్‌ఘాట్ మూసీ నది సమీపంలో ఉన్న ఒక డెకరేషన్ వస్తువుల గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

హైదరాబాద్, జులై 10: నగరంలోని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇవాళ (శుక్రవారం) అగ్నిప్రమాదం సంభవించింది. చాదర్‌ఘాట్ మూసీ నది సమీపంలో ఉన్న ఓ డెకరేషన్ వస్తువుల గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాంలో ప్లాస్టిక్, థర్మాకోల్, బట్టలు వంటి సులభంగా అంటుకునే డెకరేషన్ వస్తువులు భారీగా నిల్వ ఉంచడంతో.. క్షణాల వ్యవధిలోనే మంటలు గోదాం అంతటా వ్యాపించాయి. దట్టమైన పొగతో పాటు మంటలు పెద్ద ఎత్తున పైకి ఎగిసిపడటంతో మిగతా..2లో

## అమరావతికి 'శాంసంగ్ సిటీ'.. కొరియా కంపెనీలతో మంత్రి లోకేశ్ కీలక భేటీలు




- దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేశ్
- ఏపీలో బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు డెల్టా ఎక్స్‌కు ఆహ్వానం
- త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామన్న డెల్టా ఎక్స్ సీఈవో
- అమరావతిలో 'శాంసంగ్ సిటీ'కి లోకేశ్ ప్రతిపాదన
- ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామన్న శాంసంగ్ ప్రతినిధులు

## సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి
# పాల్పడేవారిపై చర్యలు

- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై చర్యలకు ఆదేశం
- టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సీఎం ఆదేశం
- మంత్రివర్గ అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై సీఎం చర్చ

### ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కు సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి : సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై చర్యలకు టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అవసరమైతే బయటనుంచి సిబ్బందిని తీసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అవసరమైతే కొత్తగా పీపీలను నియమించుకోవాలన్నారు. మంత్రివర్గ అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత హననంపై సుదీర్ఘంగా చర్చించారు. డీజీపీ, ఇతర పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, నేతలను కించపరుస్తూ వస్తున్న వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగతా..2లో

## రూ.9,355 కోట్లతో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలివే



- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- దాదాపు 30కి పైగా అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- రూ.1,811 కోట్లతో తాగునీటి పథకాలకు అనుమతించిన మంత్రివర్గం

అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్‌కు రూ.9,355 కోట్ల మంజూరుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు 2,943 తాగునీటి పథకాలు రూ.1,811 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. మిగతా..2లో

## మొదటి పేజి తరువాయి

### వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేయడమే మా లక్ష్యం

ప్రభుత్వం ఏర్పడిన నాటికి రాష్ట్రంపై రూ. 8.11లక్షల కోట్ల అప్పు ఉన్నా, సమర్థంగా పాలన సాగిస్తూ గత ప్రభుత్వ పథకాలతో పాటు కొత్త సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, రేషన్ కార్డులు, సన్నబియ్యం, 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, మహిళా సంఘాలకు 1000 బస్సులు, బ్యాంక్ లింకేజీతో రూ. 60 వేల కోట్ల రుణాలు, ఇందిరమ్మ చీరలు, 67,717 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలి వంటి పథకాలు అందిస్తున్నామని తెలిపారు.రైతు భరోసాను ఎకరాకు రూ. 12 వేలకు పెంచామని, 30 నెలల్లో రూ. 80 వేల కోట్ల వడ్లను కొనుగోలు చేశామన్నారు. మొక్కజొన్న రైతుల కోసం రూ. 3,504 కోట్లు విడుదల చేశామని చెప్పారు.

#### 2029 నాటికి స్థానాలు పెరుగుదల

2029 మే, జూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని, అప్పటికి రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు, శాసనసభ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని సీఎం అంచనా వేశారు. ప్రజా ప్రభుత్వంలో మంత్రులు రోజుకు 18 గంటలు పనిచేస్తారని, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలు, రైతులు, విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేసి తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా నిలబెడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరిలితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి: గవర్నర్‌కు బొత్స లేఖ

ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. అలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు సంబంధించిన మొట్టమొదటి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో జరపడమే అత్యంత సముచితం. ఈ అట్టహాస వేడుకను విజయనగరంలో కాకుండా, విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించాలని అనుకోవడం సరికాదు. ఈ నిర్ణయం వల్ల విజయనగరం జిల్లా ప్రజల ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అక్కడ ఈ వేదిక మార్పుపై తీవ్ర నిరసనలు, తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజల, విద్యార్థుల ఆకాంక్షలు, ఆనందాన్ని గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉంది. కాబట్టి, విజయనగరం జిల్లా వాసుల సెంటిమెంట్‌ను పరిగణనలోకి తీసుకుని, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరంలోనే నిర్వహించేలా ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించండి" అని తన లేఖ ద్వారా బొత్స కోరారు.

### రూ.9,355 కోట్లతో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ - ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలివే

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో దాదాపు 30కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. విశాఖలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతి జిల్లాలో 63 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై చర్చ జరిగింది. పర్యాటక పాలసీలో భాగంగా రాష్ట్రంలో కాన్సర్ట్‌ల నిర్వహణ, కాన్సర్ట్‌లకు ప్రత్యేక విధానం ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అదేవిధంగా రూ.50 కోట్లతో పర్యాటక ప్రచారానికి ఆమోదం తెలిపిన కేబినెట్, నెల్లూరులో ఐటీసీ హోటల్, కడపలో మాధవి హోటల్‌కు, విజయవాడలో సరోవర్ పోర్టికో హోటల్‌కు, కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు నిర్ణయించింది.

రూ.9,355 కోట్లతో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ – ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలివే

విశాఖ, గుంటూరు, నెల్లూరులో అంబేద్కర్ గురుకుల సీవోఈ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఐఐటీ జేఈఈ, నీట్‌కు రెసిడెన్షియల్ కోచింగ్ ప్రతిపాదనలకు అనుమతి ఇచ్చింది. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణకు, కుప్పంలో ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్‌కు ఆమోదం తెలిపింది. ఎస్ఐపీబీ సిఫార్సులతో భారీ పెట్టుబడులకు ప్రోత్సాహకాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఆర్డీఏ అథారిటీ ఆమోదించిన సంస్థలకు భూకేటాయింపులకు అనుమతులు ఇచ్చింది.

### హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని మహేశ్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి చూసి ఆయనకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయన్నారు. హరీశ్ రావు ఒకవేళ కాంగ్రెస్‌లోకి వస్తానంటే... తమ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో (పీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని నిలదీశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి నీళ్ల దోపిడీని ప్రశ్నించని ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్... ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకటేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి, కొండా సురేఖ వివాదాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డిలతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధులతో చర్చించి ఈ నెల 15న కొలిక్కి తెస్తామని కీలక అప్‌డేట్ ఇచ్చారు.

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్.. 32 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో ముఖ్యమంత్రి విజయ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారని, తమ గోడు విని ఆయన కంటతడి పెట్టుకున్నారని బాధితురాలు ధనలక్ష్మి పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో భర్తను కోల్పోయిన నివేదిక అనే మహిళకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం లభించగా, ఈ నియామకం తమ కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 10 లక్షల పరిహారం అందజేయగా, టీవీకే పార్టీ తరఫున ఒక్కో కుటుంబానికి రూ. 20 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, కరూర్ తొక్కిసలాట ఘటన తన జీవితంలో ఒక మాయని గాయమని, అత్యంత బాధాకరమైన అనుభవమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి ర్యాలీలో పోలీసుల భద్రతా ఏర్పాట్లను విశ్వసించానని, అయితే జన నియంత్రణలో వైఫల్యాలు ఎందుకు చోటుచేసుకున్నాయన్న అంశంపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. మృతుల జ్ఞాపకార్థం పార్టీ తరఫున ఒక స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

### సుప్రీంకోర్టులో ఊహించని ఘటన.. న్యాయమూర్తులపై ఆగ్రహించిన పిటిషనర్..

ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. దీంతో కోర్టు హాలులో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం నిందితుడు చేతిలో ఉన్న కేసు పత్రాల కట్టను న్యాయమూర్తుల డయాస్ వైపు విసిరేయడంతో భద్రతా అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. పిటిషనర్‌ను బలవంతంగా కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన న్యాయమూర్తులు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం కేసు విచారణ చేస్తున్న సమయంలో జరిగింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఓ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. నేడు విచారణ సందర్భంగా స్వయంగా హాజరై తన వాదనలు వినిపించే క్రమంలో అసాధారణంగా దూకుడుగా ప్రవర్తించాడు. వాదనలు ప్రారంభించిన వెంటనే 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను ఆదేశిస్తున్నా' అంటూ న్యాయమూర్తులను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. దీంతో ఆశ్చర్యానికి గురైన జస్టిస్ కేవీ విశ్వనాథన్.. 'మీరు మమ్మల్ని ఆదేశిస్తున్నారా?' అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన పిటిషనర్ 'నా తరఫున చెప్పాల్సిందంతా చెప్పాను. అన్నీ రికార్డులో ఉన్నాయి' అని పేర్కొన్నాడు. అనంతరం ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై కేసు పత్రాలను గాల్లోకి విసిరేయడంతో పాటు, కోర్టు హాలులోనే న్యాయమూర్తులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పిటిషనర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టు హాలు నుంచి బయటకు తరలించారు. ఈ ఘటనతో కొద్దిసేపు కోర్టు హాలులో కలకలం రేగింది. అయినా న్యాయమూర్తులు ఏమాత్రం సహనం కోల్పోకుండా విచారణను కొనసాగించడం విశేషం.

### హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం.. డెకరేషన్ వస్తువుల గోదాంలో మంటలు

స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. రెండు ఫైరింజన్లు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంటలు పక్కనే ఉన్న ఇతర భవనాలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రమాదానికి గల కారణాలు (షార్ట్ సర్క్యూట్ లేదా మరేదైనా కారణమా అనేది) ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం అందుతోంది. పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

## సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై చర్యలు

మొదటి పేజి తరువాయి



భావ ప్రకటన స్వేచ్ఛను గౌరవిస్తూనే అభ్యంతరకర వ్యాఖ్యలను మాత్రం ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వంపై అభూత కల్పనలు, అసత్యాలు, అసలు విషయాలు వక్రీకరిస్తే మాత్రం ఉపేక్షించవద్దని మంత్రులు గట్టిగా కోరారు. వైఎస్సార్సీపీ వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దు : ఈరోజు నుంచే పోలీస్ యంత్రాంగం సోషల్ మీడియాపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే సోషల్ మీడియాపై ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీలో కూడా చర్చించాలన్నారు. వైఎస్సార్సీపీ నేతలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం పై నుంచి దృష్టి మరల్చేందుకు కొత్త పద్ధతి ఎన్నుకున్నారని, కావాలని కూటమి నేతలను రెచ్చగొడుతున్నారని సీఎం మంత్రులకు చెప్పారు. వైఎస్సార్సీపీ వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సీఎం సూచించారు. అనంతపురం, మిగతా జిల్లాలలో జరిగిన సంఘటనలను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. ఇన్‌ఛార్జి మంత్రులు రెవెన్యూ, ఇతర సమస్యలపై కూడా దృష్టి సారించాలని ఆదేశించారు. ఆయా జిల్లాలో ప్రతి అంశంపై ఇంచార్జి మంత్రులు దృష్టి కేంద్రీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. బ్లేడ్ బ్యాచ్ కి తోడు గంజాయ్ బ్యాచ్ : మరోవైపు కులపరమైన అంశాలు, తప్పుడు వార్తలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా స్ప్రెడ్ చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. తమ స్వార్థ రాజకీయాలకు బ్లేడ్ బ్యాచ్ కి తోడు గంజాయ్ బ్యాచ్ ని అడ్డంపెట్టుకుని కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటిపై పూర్తి నియంత్రణ రావాలని సీఎం ఆదేశించారు. అనంతపురంలో తోపుదుర్తి దాడులకు కుట్రలు పన్ని రెచ్చగొట్టే ట్రాప్ పన్నాడని మంత్రుల మధ్య చర్చ జరిగింది. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వార్తల నియంత్రణకు హోంశాఖ – న్యాయ శాఖ కలిసి పనిచేయాలన్నది పవన్ కల్యాణ్ అభిమతంగా నాదెండ్ల మనోహర్ చెప్పారు. వాట్సాప్ యూజర్ నేమ్ అందుబాటులోకి వస్తే సోషల్ మీడియా సమస్యలు అధికమవుతాయని డీజీపీ అభిప్రాయపడ్డారు. జలధార 100 రోజుల కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. జిల్లాల వారీగా జలధారపై మంత్రులు సమీక్షించాలని ఆదేశించారు. శాఖాపరంగా ప్రభుత్వ భూ వివాదాలను మంత్రులు పరిష్కరించాలని సీఎం సూచించారు. ఎల్ నినో ప్రభావంతో చోటు చేసుకుంటున్న వాతావరణ హెచ్చుతగ్గులపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు 3న ప్రారంభించే 210 ఉద్యానవన క్లస్టర్స్ ప్రారంభోత్సవంలో నేతలంతా పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రిపీటెడ్ గా వచ్చే అర్జీలు ఎందుకు పరిష్కారం కావట్లేదో అధ్యయనం చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సైబర్ క్రైమ్ సమస్యల పరిష్కారం కోసం ఐజీ స్థాయి అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. రూ.లక్షా 50 వేల వరకు వ్యవసాయ రుణమాఫీ : అంతకుముందు సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 30కి పైగా కీలక అంశాలకు ఆమోదం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.9,355 కోట్ల అంచనా వ్యయంతో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వీటితో పాటు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాల కోసం రూ.1,811 వ్యయంతో 2,943 తాగునీటి పథకాలను చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రెండో విడత భూసమీకరణలో భాగస్వాములైన 7 గ్రామాల రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ పరిధిలోని ప్రతి రైతు కుటుంబానికి గరిష్ఠంగా లక్షా 50 వేల వరకు వ్యవసాయ రుణమాఫీ వర్తింపజేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## టీఆర్ఎస్‌ను గెలిపిస్తే.. రైతును రాజును చేసి చూపిస్తా

మొదటి పేజి తరువాయి

'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని తెలిపారు. కొత్త పార్టీలో మార్పులు ఉంటాయని.. 'పాంచజన్యం' పేరుతో ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఎంత పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం.. తన ప్రయాణానికి మీ సహకారం కావాలని ప్రజలను కోరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామం ఆదివాసి నాయకపోడు గ్రామాల్లో సమస్యలు వారి జీవన విధానాన్ని తెలంగాణ రక్షణ పార్టీ అధ్యక్షురాలు (౨=వా) కల్వకుంట్ల కవిత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. రాజకీయాల కోసం రాలేదని.. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మీ ముందుకు వచ్చానని అన్నారు. వెనకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని స్థాపించానని వివరించారు. సమాజంలో ఉన్న వెనకబడిన వ్యవస్థను మార్చడానికే ఆడబిడ్డగా ధైర్యంగా తాను ముందుకు వచ్చానని పేర్కొన్నారు. మీ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉంది.. గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మార్పు రాలేదు.. నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరం.. గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని పేర్కొన్నారు. తెలంగాణలో ఆదివాసీకి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను కవిత సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడి ఆదివాసీలకు రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు బ్యాంక్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి.. ఇది వారి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.

## అమరావతికి 'శాంసంగ్ సిటీ'.. కొరియా కంపెనీలతో మంత్రి లోకేశ్ కీలక భేటీలు

మొదటి పేజి తరువాయి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను అత్యాధునిక సాంకేతికత, పారిశ్రామిక పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) తయారీలో పేరొందిన డెల్టా ఎక్స్, ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ కంపెనీల ఉన్నతాధికారులతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. ఏపీలో భారీ ఎత్తున తయారీ, పరిశోధన యూనిట్లను స్థాపించాలని ఆయన ఈ కంపెనీలను ఆహ్వానించారు.

#### ఏపీలో బ్యాటరీ యూనిట్‌కు డెల్టా ఎక్స్ సానుకూలం

సియోల్‌లో డెల్టా ఎక్స్ ఫౌండర్, సీఈవో స్టీఫెన్ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టుల లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ ప్రణాళికలకు అనుగుణంగా రాష్ట్రంలో సోలార్ మాడ్యూళ్లు, బ్యాటరీ సెల్స్ తయారీకి అనువైన పర్యావరణాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. పోర్టులు, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్న ఏపీలో ఒక



బీఈఎస్ఎస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డెల్టా ఎక్స్‌ను కోరారు. దీనికి డెల్టా ఎక్స్ సీఈవో స్టీఫెన్ కిమ్ సానుకూలంగా స్పందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన మంత్రికి తెలిపారు.

#### శాంసంగ్‌కు భారీ ప్రతిపాదనలు

అనంతరం, ప్రపంచ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ జో యున్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు. ఏఐ, డేటా సెంటర్ హబ్: రాష్ట్రంలోని 10 గిగావాట్ల డేటా సెంటర్ పైప్‌లైన్‌ను ఉపయోగించుకుని, ఏఐ-కంప్యూట్, సర్వర్ తయారీ, సర్వీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను శాంసంగ్‌కు ప్రధాన కేంద్రంగా మార్చాలని లోకేశ్ కోరారు. తయారీ యూనిట్లు: ఏపీలో ఒక డిస్‌ప్లే ఫ్యాబ్, విశాఖపట్నంలోని ఐఎస్ఎం ఓఎస్ఏటీ క్లస్టర్‌ను ఆధారంగా చేసుకుని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ కోసం ఒక సెమీకండక్టర్ యూనిట్ (ఓఎస్ఏటీ) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు మద్దతుగా మొబైల్, డివైస్ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అమరావతిలో భాగస్వామ్యం: రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో శాంసంగ్ భాగస్వామి కావాలని ఆహ్వానించారు. అమరావతి క్వాంటం వ్యాలీలో శాంసంగ్ ఆర్&డీ విభాగాన్ని నెలకొల్పాలని సూచించారు. శాంసంగ్ సిటీ: వీటన్నిటికీ మించి శాంసంగ్ బహుళ విభాగాలకు ఒకేచోట నిలయంగా ఉండేలా ఏపీలో ఒక ప్రత్యేక 'శాంసంగ్ సిటీ'ని నిర్మించాలన్న భారీ ప్రతిపాదనను కూడా లోకేశ్ వారి ముందుంచారు. మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనలపై శాంసంగ్ ప్రతినిధులు స్పందిస్తూ, తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు. మొత్తం మీద, గ్రీన్ ఎనర్జీ, హై-టెక్ తయారీ రంగాలలో కొరియా దిగ్గజాలను ఏపీకి ఆకర్షించేందుకు మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రయత్నాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా డెల్టా ఎక్స్ నుంచి సానుకూల స్పందన రావడం రాష్ట్రానికి శుభపరిణామంగా భావిస్తున్నారు.

## భద్రాద్రి రామయ్య మీద ఒట్టు - వచ్చే ఎన్నికల్లో 117 సీట్లతో మళ్లీ మాదే అధికారం

కొందరు తనను ప్రశ్నించారని గుర్తు చేశారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే చెప్పానని, ఎన్నికల్లో తమ పార్టీకి 64 సీట్లు వచ్చాయని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు వచ్చాయన్నారు. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశాం : బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు వస్తాయని చేవెళ్ల సభలో చెప్పానని, చేవెళ్ల సభలో చెప్పినట్లే బీఆర్ఎస్‌కు గుండు సున్నా సీట్లు వచ్చాయని తెలిపారు. అన్ని ఎన్నికల్లోనూ తాను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారన్న ఆయన, అన్ని ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశామని అన్నారు. కౌరవ వంశాన్ని (కల్వకుంట్ల కుటుంబం) తెలంగాణ గడ్డ మీద నుంచి తొలగిస్తామని, కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా అణగ దొక్కేవరకు విశ్రాంతి తీసుకోనని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీ లిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు. 2029 మే, జూన్‌లో జరుగుతాయి. అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, ఎంపీ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. 117 సీట్లు గెలుస్తామని భద్రాచలం రాముడి మీద ఆన. – రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు : నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని,



నేడు వరి వస్తే కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారని, కేసీఆర్ ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకో కాకిలా మాడిపోతావని ఎద్దేవా చేశారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అని వెల్లడించారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని, కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు ఉన్నాయని, వారి కుటుంబంలో ఒకరిని చూస్తే ఒకరికి నచ్చదని విమర్శించారు. భద్రాచలం రాముడు మునగాలా? : మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, ఒకవేళ మేడిగడ్డలో నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు బీజేపీ నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారని ఆరోపించిన సీఎం, బీజేపీతో మంతనాలు చేయట్లేదని హరీశ్‌రావు ప్రమాణం చేస్తారా? అని సవాల్ విసిరారు. తాటిచెట్టంత పెరిగిన ఆయనకు బుర్రలో గుజ్జు లేదని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని ఆయన చెల్లెలే చెబుతున్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల నుంచి ఆయన డబ్బులు తీసుకున్నారని చెల్లెలే చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్ని రద్దు చేయలేదు. నిరుద్యోగుల కలను కేసీఆర్ నెరవేర్చలేదు. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 67 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆడబిడ్డలకు చీరల పంపిణీ చేసేందుకూ వాళ్లు కమీషన్లు తీసుకున్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. భట్టి కోరిక మేరకు మధిరకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నా. 20 ఎంపీ సీట్లు గెలిచి కాంగ్రెస్ అధిష్ఠానానికి బహుమతి ఇస్తాం. 5 లక్షల మందితో త్వరలో రాహుల్‌గాంధీతో ఖమ్మంలో సభ పెడతాం

## భారత తొలి హైడ్రోజన్ ట్రైన్ కు రైల్వే శాఖ ఆమోదం

మొదటి పేజి తరువాయి

రైలు ట్రయల్ రన్ పూర్తి చేశారు. ఇందులో అత్యవసర బ్రేకింగ్ దూరం, రైలు డోలనం వంటి కీలక అంశాలపై దృష్టి సారించారు. రానున్న 10 నుంచి 12 రోజుల్లో మిగిలిన అన్ని పరీక్షలు పూర్తయ్యే అవకాశం ఉందని రైల్వే వర్గాలు వెల్లడించాయి. అనంతరం రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్డీఎస్‌వో) నుంచి తుది అనుమతి లభిస్తే, సాధారణ రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్వరలోనే ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది. రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకారం, ఈ రైలు త్వరలో ప్రారంభం కావడానికి సిద్ధంగా ఉంది. 1200 కిలోవాట్ల ఇంజిన్ సాయంతో గంటకు 75 కిలోమీటర్ల గరిష్ట వేగంతో నడుస్తుంది. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ప్రొపల్షన్ సిస్టమ్ తో స్వచ్ఛమైన, మరింత శక్తి సామర్థ్యం గల రైలు రవాణాను ప్రోత్సహించడమే లక్ష్యం. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ అనేది హైడ్రోజన్‌ను ఉపయోగించి రసాయన చర్య ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. దీని ఫలితంగా నీటి ఆవిరి మాత్రమే ఉద్గారంగా వెలువడుతుంది. ఇది సంప్రదాయ



శిలాజ ఇంధన ఆధారిత ట్రాక్షన్ సిస్టమ్‌లకు స్వచ్ఛమైన ప్రత్యామ్నాయం అని రైల్వే శాఖ తెలిపింది. ఈ రైలు కోసం జింద్‌లో స్వదేశీ హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ కంప్రెస్ డ్ హైడ్రోజన్ గ్యాస్ ను నిల్వ, పంపిణీ చేసేందుకు పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పెసో) అవసరమైన లైసెన్సును మంజూరు చేసింది.

#### తక్కువ ఖర్చుతో హైడ్రోజన్ రైలు

కాగా, సాధారణంగా డీజిల్‌తో నడిచే రైళ్లు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను విడుదల చేస్తాయి. ఫలితంగా వాయు కాలుష్యం పెరుగుతుంది. అటు ఎలక్ట్రిక్ రైళ్లు నడపాలంటే బాగా ఖర్చుతో కూడుకున్న విషయం. ముఖ్యంగా ఓవర్‌హెడ్ లైన్ మౌలిక సదుపాయాలు అవసరం. అయితే, తక్కువ ఖర్చుతోనే హైడ్రోజన్ రైలును నడపొచ్చు. అలాగే ఇది కాలుష్య కారకాలను ఉత్తత్తి చేయదు. ఫలితంగా పర్యావరణానికి కూడా ఎలాంటి హాని ఉండదు. అంతే కాకుండా ఈ హైడ్రోజన్ రైలు డీజిల్ ఇంజిన్ల లాగా భారీ శబ్దాలు చేయకుండా చాలా నిశబ్దంగా వెళ్లిపోతుంది.

అధునాతన ఫీచర్లు

ఇదిలా ఉండగా, హైడ్రోజన్ రైలు బోగీలను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో తయారు చేశారు. బ్రాడ్ గేజ్ ప్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రపంచంలోనే అతి పొడవైన రైలు (10 కోచ్‌లు) ఇదే కానుంది. అలాగే అత్యంత శక్తివంతమైన (2400 ఎంజ) హైడ్రోజన్ రైలు కూడా ఇదే అవ్వనుంది. దీనికి రెండు 1200 ఎంజ డ్రైవింగ్ పవర్ కార్లు (డీపీసీలు) ఉన్నాయి. అంటే ఒకటి ఇంజిన్ ముందు భాగంలో, మరొకటి వెనుక భాగంలో అమర్చి ఉంటుంది. ఇందులో ఎనిమిది ప్యాసింజర్ కార్లు కూడా ఉన్నాయి. అలాగే హైడ్రోజన్ రైలు సౌకర్యాల పరంగా కూడా చాలా అధునాతనంగా ఉంటుంది. దీనికి ఆటోమేటిక్ డోర్లు, డిజిటల్ డిస్‌ప్లేలు ఉంటాయి. ఇంటీరియర్ డిజైన్ కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుంది.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం.

### ఆత్మకూరులో ర్యాలీ, ధర్నా




ఆత్మకూరు, జులై 9 (వార్త నిర్భయం) విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ ఐ పి డి ఎస్ యు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల పరిధిలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈరోజు ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలను బంద్ చేసి, అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు కె. రాఘవ, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు చంటి, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్లి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4000కు కుదించే ఆలోచనను విరమించుకోవాలి. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని వెంటనే నియమించాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు అందించాలి. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి, అక్షయపాత్ర, ఇస్కా వంటి సంస్థలకు కాకుండా మహిళా సంఘాల ద్వారానే అమలు చేయాలి. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. తమిళనాడు తరహా ప్రభుత్వ విధానాలు అవలంబించాలి. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఎ ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు 8,500 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలి. +ూ నెం. 7, 8, 9 లను రద్దు చేయాలి. అద్దె భవనాల్లో నడుస్తున్న పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా తెరిచిన పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ విక్రయ కేంద్రాలను మూసివేయాలి. ఖాళీగా ఉన్న ఎంఈఓ డి ఈ ఓ ఇతర పోస్టులను భర్తీ చేయాలి. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రమేష్, మండల నాయకులు సంజయ్, రాజేష్, సంతోష్, అప్రోచ్, ౹ాణూఖ నాయకులు విశాల్, చరణ్, ఉదయ్, మనోర్, చరణ్‌లి తదితర విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యారంగ డిమాండ్లతో ఆత్మకూరు బంద్. SFI, DYFI, PDSU ధర్నా

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి.

### ఖమ్మం ఆర్ఎంకు టి డబ్ల్యూ జే ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల వినతి



ఖమ్మం, జులై 10 – (వార్త నిర్భయం) రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ డబ్ల్యూ జె ఎఫ్ హెచ్–2843 ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్యలి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు నానబాల రామకృష్ణ, జిల్లా కార్యదర్శి అర్వపల్లి నగేష్ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారని, ఆర్టీసీ సంస్థకు కూడా సహకరిస్తున్నారని తెలిపారు. గతంలో 1/3 రాయితీపై ప్రయాణ సౌకర్యం అమలు చేస్తుండగా, ఇప్పుడు దాదాపు 50% చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చాలా మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినా వృత్తిలో కొనసాగుతూ వార్తల సేకరణ కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోందని, ఈ చార్జీల భారం వారికి ఆర్థిక ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించగా, జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టులకు అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలి. ఇతర రాష్ట్రాలకు వెళ్లే తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లోనూ ఈ సదుపాయం వర్తింపజేయాలి. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వేములకొండ రమేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, గంటేల కుమార్, నగర అధ్యక్షులు కప్పల మధు, నగర ప్రధాన కార్యదర్శి ఎలిసెట్టి రామకృష్ణ, గుజ్జు గోపాలకృష్ణలి తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి ఎలక్ట్రికల్ స్మశాన మిషన్ ఏర్పాటు చేయాలి.

### ఎమ్మెల్యే మేఘారెడ్డి కి బహుజన జేఏసీ వినతి




వనపర్తి బ్యూరో, జులై 10 (వార్త నిర్భయం) ది

వనపర్తి పట్టణంలోని హిందూ స్మశాన వాటికలో తీవ్ర స్థలాభావం, అనారోగ్య సమస్యలు ఉన్నాయని, వెంటనే ఎలక్ట్రికల్ స్మశాన మిషన్ ఏర్పాటు చేయాలని బహుజన అణగారిన కులాల పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము రాములు మాదిగ వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రంలో వారు పేర్కొంటూ, వనపర్తి పట్టణంలో హిందూ స్మశాన వాటిక స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి కులాలకు చెందిన వ్యక్తులు మరణిస్తే పూడ్చడానికి 6 అడుగుల గుంతలు తవ్వుతున్నారని, ఆ గుంతలలో ఇప్పటికే ఉన్న ఎముకలు, పుర్రెలు బయటపడుతున్నాయని తెలిపారు. ముస్లింలకు, క్రిస్టియన్లకు ప్రత్యేక స్మశాన స్థలాలు ఉండగా, దళిత బహుజనులకు మాత్రం సరైన స్థలం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీజేపీ నాయకులు కృష్ణ, వాకిటి శ్రీధర్, కొమ్ము రాములు మాదిగ రాజీవ్ చౌరస్తాలో ఆమరణ నిరాహార దీక్ష చేయగా, శ్రీనివాసపురం శివారులో కొంత స్థలాన్ని స్మశాన వాటికకు కేటాయించారని, కానీ ఆ స్థలం కూడా సరిపోక ఒక శవాన్ని పూడ్చిన చోటే మరో శవాన్ని పూడ్చాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. వనపర్తి పట్టణంలో ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయని, కొంతమంది దళారులు వాటిని కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్ముతున్నారని ఆరోపించారు. కావున ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరిపి హిందువులను పూడ్చడానికి మరో స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రత్యామ్నాయంగా మానవతా దృక్పథంతో తక్షణమే కరెంట్ ఎలక్ట్రికల్ స్మశాన మిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. శవాలను కాల్చిన తర్వాత వచ్చే బూడిదను వారి బంధువులకు అందజేస్తే వారు ఏ గంగలోనైనా కలుపుకుంటారని కుటుంబ సభ్యులు కోరుతున్నారని తెలిపారు. వనపర్తి నియోజకవర్గ ప్రజల బాగోగులు చూసే వ్యక్తిగా ఎమ్మెల్యే మేఘారెడ్డి గారు ఈ సమస్యపై స్పందించి, కరెంట్ ఎలక్ట్రికల్ మిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము రాములు మాదిగ, సామాజిక కార్యకర్త గంధం నాగరాజు, హుస్సేన్ జర్నలిస్ట్ తదితరులు సమర్పించారు..

# భద్రకాళి మాడ వీధుల బాధిత కుటుంబాలకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్

### బాధిత కుటుంబాల జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ ప్రతినిధి జూలై 10 ( వార్త నిర్భయం న్యూస్ )

భద్రకాళి మాడ వీధుల అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రభావితమైన కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించే చర్యల్లో భాగంగా, అర్హులైన 30 మంది బాధితులకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రాలను శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, నియామక పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. బాధిత కుటుంబాల జీవనోపాధి మెరుగుపడేలా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం ప్రాధాన్యంతో అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, గృహ, ఉపాధి పథకాల ప్రయోజనాలు కూడా అర్హులైన కుటుంబాలకు అందేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు SIR ప్రక్రియ (స్పెషల్ ఇంటెన్సీ రివిజన్లో పాల్గొన్న చీ. మోహన్ గౌడ్ .



వర్ధన్నపేట నియోజకవర్గం ప్రతినిధి జులై 10 (వార్త నిర్భయం)

ఈరోజు SIR (ంజూవఌఖుశ్రీ అ†వఅంఅజవ తీవజఱంఱశీఅ) ప్రక్రియలో భాగంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులి ఆదేశాల మేరకు అయినవోలు మండలం.. నాగారం గ్రామంలో దీూూ తో దీూూ లతో కలిసి పాల్గొని ఓటర్ల వద్దకు తిరుగుతూ ఓటర్లకు ఏన్యు మరేషన్ ఫామ్ ఏ విధంగా పూరించాలో, తప్పులు ఏ విధంగా సరి చేసుకోవాలో అవగాహన కలుగజేస్తూ ఓటర్ మహాశయులకు సమయం ఎక్కువగా లేదు కావున ప్రతి ఒక్కరూ ఈ ఓటర్ ఎస్ ఐ ఆర్ సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యం కల్పించే ఓటు హక్కును కాపాడుకోవాలని తెలియజేసిన ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నకర కంటి మోహన్ గౌడ్ వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బరిగల కుమారస్వామి, శ్రీ గొల్లపల్లి సంపత్ , ఎండి రహీం పాషా , జన్ను కుమారస్వామి , కట్కూరి రాజేందర్ , ఆడెపు సుజాతలతో పాటు బిఎల్ఓ వేణు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## జప్తు చేసిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవాలని కాజీపేట ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి






హనుమకొండ జూలై 10 (వార్తా నిర్భయం న్యూస్):

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కారణాలతో జప్తు చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచిన ద్విచక్ర వాహనాల యజమానులు తమ వాహనాలను సంబంధిత పత్రాలు చూపించి స్వాధీనం చేసుకోవాలని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, బీమా, డ్రైవింగ్ లైసెన్స్ తదితర అవసరమైన పత్రాలను సమర్పించి వాహనాలను తీసుకెళ్లవచ్చని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, పెండింగ్ చలాన్లు వంటి కేసులు ఉన్న యజమానులు ముందుగా వాటిని త్వరితగతిన పరిష్కరించుకుని అనంతరం తమ వాహనాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై–సిటీస్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పిట్టల వెంకన్న కోరారు.

## వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం ఆశయాలు కొనసాగిస్తాం. - CPI(ML) రెడ్ స్టార్ రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల




గుమ్మలక్ష్మీపురం, జులై 10 (వార్త నిర్భయం) దోపిడీ, వెట్టిచాకిరీపై పోరాడి అమరులైన కామ్రేడ్లు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం ఆశయాలను కొనసాగిస్తామని జూ×(మీూ) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్నలి అన్నారు. గుమ్మ గ్రామంలోని అమరవీరుల విగ్రహం వద్ద పార్టీ రాష్ట్ర మూడవ మహాసభల పోస్టర్‌ను జిల్లా నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట ఫలితంగానే నేడు గిరిజనులకు హక్కులు, భూములు లభించాయని, అయితే నేటి పాలకుల విధానాల వల్ల గిరిజన సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూ×(మీూ) రెడ్ స్టార్ పార్టీ రాష్ట్ర మూడవ మహాసభలు జూలై 25, 26లి తేదీల్లో లిపార్వతీపురంలిలో జరుగుతాయని తెలిపారు. 20 జిల్లాల నుంచి డెలిగేట్లు పాల్గొంటారని, 25న వేలాదిమందితో "ప్రజా ప్రదర్శన" నిర్వహిస్తామన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతు సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ ఉద్యమాలను రూపొందిస్తామని చెప్పారు. మహాసభలు జయప్రదం చేయాలని ప్రజలను కోరారు.

## సీనియర్ జర్నలిస్ట్ జక్కుల విజయ్ కుమార్ 60వ జన్మదిన వేడుకలు

వరంగల్ ప్రతినిధి జూలై 10( వార్త నిర్భయం)

సీనియర్ జర్నలిస్ట్ జక్కుల విజయ్ కుమార్ 60వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయనకు సహచర జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో మరెన్నో సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ సాజిద్ పాషా, జనరల్ సెక్రటరీ ఎం.ఎ. నయీం, ఉపాధ్యక్షులు మహమ్మద్ మునవర్, జాయింట్ సెక్రటరీ మాషుక్ షరీఫ్, ఖాదర్ బాషా, వికలాంగుల అధ్యక్షులు మహమ్మద్ అజీమ్, కార్పొరేటర్ అరుణ్ తదితరులు పాల్గొని జక్కుల విజయ్ కుమార్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఫ్రైడే డ్రైడేలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ. పీర్లగుట్ట అర్బన్ హెల్త్ సెంటర్‌లో పరిశుభ్రతపై అవగాహన



వనపర్తి బ్యూరో, జులై 10 – (వార్త నిర్భయం)ఫ్రైడే డ్రైడేలి సందర్భంగా వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్, పీర్లగుట్ట ప్రాంతంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిలో నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించి, దోమల నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కలెక్టర్ ఇంటింటికి వెళ్లి ఇంటి యజమానులతో మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# చేనేత సహకార సంఘం ఎన్నికల్లో బిజెపి హ్యాట్రిక్.



అమరచింతలో 9 కి 9 స్థానాలు కైవసం

వనపర్తి బ్యూరో, జులై 10 (వార్త నిర్భయం ) అమరచింత చేనేత సహకార సంఘం ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించింది. మొత్తం 9 స్థానాలకు గాను 9 స్థానాల్లో బిజెపి అభ్యర్థులు విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. చేనేత కార్మికుల సంక్షేమం, సంఘ అభివృద్ధే లక్ష్యంగా బిజెపి ప్రతిపాదించిన అభివృద్ధి ఎజెండాకు కార్మికులు బ్రహ్మరథం పట్టారు. పార్టీ నాయకుల కృషి, ప్రచారం ఫలితంగా అన్ని స్థానాల్లో పూర్తి మెజారిటీతో విజయం సాధించడం పట్ల కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ విజయం చేనేత కార్మికులు బిజెపిపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పార్టీ నాయకులు తెలిపారు. గెలిచిన సభ్యులందరూ కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంఘ అభివృద్ధికి కృషి చేస్తారని ఆకాంక్షించారు.

# 6 గ్యారంటీలు 420 హామీలు అమలు కావడం లేదు.

**బిజెపి పాలనలో మందిరంలో కోట్ల చోరీ**

**యుద్ధాలు, అంతరాలు లేని సమాజమే కమ్యూనిస్టుల లక్ష్యం**

**సిపిఐ శిక్షణ తరగతుల ప్రారంభంలో చాడ వెంకటరెడ్డి.**

వనపర్తి బ్యూరో, జులై 10 – (వార్త నిర్భయం) అంతరాలు లేని సమ సమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యమని, అందుకోసం సమాజాన్ని చైతన్యం చేసి పోరాడాలని సిపిఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.వనపర్తిలో శుక్రవారం సిపిఐ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుల 3 రోజుల శిక్షణ తరగతులు (జూలై 10, 11, 12)ప్రారంభమయ్యాయి. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ అరుణ పతాకాన్ని ఆవిష్కరించగా, చాడ వెంకటరెడ్డి తరగతులను ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా మాట్లాడిన చాడ వెంకటరెడ్డి, ప్రపంచంలో యుద్ధ వాతావరణం రాజ్యమేలుతోందని, అమెరికా, ఇజ్రాయిల్ వంటి దేశాలు నరమేధానికి ఉసిగొల్పుతున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్యానంతరం భారత్ అలీన విధానంతో ముందుకు సాగిందని, కానీ మోదీ యుద్ధం పట్ల వ్యవహరించిన తీరు దేశ పరువు తీసిందన్నారు.రామ మందిరం పేరుతో అధికారంలోకి వచ్చిన బిజెపి, అదే మందిరంలో కోట్ల రూపాయల చోరీ జరిగినా ప్రధాని స్పందించకపోవడం దారుణమని, సిబిఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మత రాజకీయాలు నడుపుతూ ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు కావడం లేదురాష్ట్ర రాజకీయ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో



అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో రాజకీయ జోక్యం పెరిగిందని, అర్హులకు ఇండ్లు రావడం లేదని అన్నారు. భూదాన భూముల్లో పేదలు ఇండ్లు కట్టుకుంటే కూలగొట్టి రోడ్డు పాలు చేశారని, మహిళలకు 2500 ఇవ్వలేదని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయడం లేదని ఆరోపించారు.మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సీఎం రేవంత్ రెడ్డిపై పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత ఉందని, పాలమూరు రంగారెడ్డి, కేఎల్, ఐబి, జూరాల ప్రాజెక్టుల పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు, ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రజా ఉద్యమాలు నిర్మించి సిపిఐ ముందుండి పోరాడుతుందని ప్రజలు కలిసి రావాలని కోరారు.ఈ శిక్షణ శిబిరంలో లిసిపిఐ జిల్లా కార్యదర్శులు విజయరాములు, బాలకిషన్, బి. ఆంజనేయులు, రాస సమితి సభ్యుడు కేశవులు గౌడ్, వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్‌లితో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించేదాకా పోరాటం ఆగదు

సూర్యాపేట బ్యూరో జూలై 10 వార్త నిర్భయం మొదట ప్రతిపాదించిన హైదరాబాద్--సూర్యాపేట--ఖమ్మం రైల్వే మార్గాన్నే అమలు చేయాలిసూర్యాపేట ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే సరిదిద్దాలిసూర్యాపేట జిల్లాకు రైల్వే లైన్ విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సరిదిద్దాలని సూర్యాపేట రైల్వే సాధన సమితి డిమాండ్ చేసింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్దన్, కో-కన్వీనర్ రాచురి ప్రతాప్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రంగా రెడ్డి, గౌరవ సలహాదారు లింగంపల్లి భద్రయ్య తెలిపారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ, ఒకప్పుడు ప్రతిపాదించిన హైదరాబాద్--సూర్యాపేట--ఖమ్మం రైల్వే మార్గం, అలాగే సూర్యాపేట--కర్నూలు రైల్వే లైన్ అమలైతే సూర్యాపేట దక్షిణ తెలంగాణలో కీలక రైల్వే జంక్షన్‌గా ఎదుగుతుందని ప్రజలు ఎంతో ఆశించారని గుర్తు చేశారు. అయితే అనంతరం ఖమ్మం మార్గాన్ని మార్చి దాచేపల్లి వైపు మళ్లించడం ద్వారా సూర్యాపేట ప్రజల ఆశలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు.సూర్యాపేట చారిత్రక, భౌగోళిక, వాణిజ్య పరంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన పట్టణమని వారు పేర్కొన్నారు. ప్రతిరోజూ దాదాపు పది మండలాల ప్రజలు, విద్య, వైద్యం, వ్యాపారం, ఉద్యోగాలు, ప్రభుత్వ కార్యాలయాల అవసరాల కోసం సూర్యాపేటకు వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే ప్రముఖ వాణిజ్య కేంద్రంగా ఎదిగిన ఈ జిల్లా కేంద్రంలో అనేక జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేయడం, సూర్యాపేట ఆర్థిక సామర్థ్యానికి నిదర్శనమన్నారు.సూర్యాపేట నుండి ఖమ్మం సుమారు 55 కిలోమీటర్లు, వరంగల్ కు 125 కిలోమీటర్లు, హైదరాబాద్, విజయవాడ నగరాలు దాదాపు సమాన దూరంలో ఉన్నాయని, ఇటువంటి వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన ప్రాంతానికి రైల్వే సౌకర్యం లేకపోవడం అభివృద్ధికి తీవ్ర ఆటంకమని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని జిల్లాలకు రైల్వే అనుసంధానం ఉండగా, తెలంగాణలోని సూర్యాపేట జిల్లాకు ఇప్పటికీ ఒక్క రైల్వే లైన్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా జిల్లాకు రైల్వే సౌకర్యం కల్పించకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.రైల్వే లైన్ ఏర్పడితే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, కార్మికులు, సామాన్య ప్రయాణికులు భారీగా లబ్ధి పొందుతారని తెలిపారు. వ్యాపారులకు సరుకుల రవాణా సులభమవుతుందని, హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు తక్కువ ఖర్చుతో, వేగంగా ప్రయాణించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. వైద్యం, న్యాయపరమైన అవసరాలు, విద్య,



ఉపాధి అవకాశాల కోసం కూడా ఈ రైల్వే మార్గం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.ప్రస్తుతం ప్రతిపాదించిన మార్గాన్ని ప్రభుత్వం పునఃసమీక్షించి, మొదట ప్రకటించిన హైదరాబాద్--సూర్యాపేట--ఖమ్మం రైల్వే లైన్‌ను యథాతథంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సూర్యాపేట ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇకపై సహించబోమని స్పష్టం చేశారు.సూర్యాపేట రైల్వే లైన్ సాధన కోసం విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.

ఈ ఉద్యమానికి రాజకీయ రంగులు పులమకుండా పౌర సమాజం ముందుండి నాయకత్వం వహించాలని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక, రైతు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు ఈ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించి కార్యాచరణలో భాగస్వాములు కావాలని కోరారు.రాబోయే రోజుల్లో సంతకాల సేకరణ, వినతిపత్రాల సమర్పణ, ప్రజా సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు,

ప్రజాప్రతినిధుల ముట్టడులు తదితర ప్రజాస్వామ్య పోరాట కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా ప్రజలందరూ, వ్యాపార వర్గాలు, పారిశ్రామికవేత్తలు, మేధావులు, యువత, ఉద్యోగులు, ప్రవాసులు తమవంతు నైతిక, ఆర్థిక, కార్యాచరణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేయడమే మా లక్ష్యం

**రైతుల కళ్లల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం**

**జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభ - రూ. 1009.15 కోట్ల రైతు భరోసా విడుదల**

**సీఎం రేవంత్ రెడ్డి.**



హైదరాబాద్/ఖమ్మం, జులై 10 ( వార్త నిర్భయం) రాష్ట్రంలోని రైతుల కళ్లల్లో ఆనందమే ప్రజా ప్రభుత్వానికి అసలైన ఆశీర్వాదమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. "వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేయడమే మా లక్ష్యం అని స్పష్టం చేశారు.గడిచిన 9 రోజుల్లో రూ. 9,000 కోట్లు మేరకు 73.30 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా చెల్లించిన సందర్భంగా ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలి గ్రామంలో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహించారు.సభా వేదికగా చివరి విడతగా 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 1009.15 కోట్లు విడుదల చేయడంతో పాటు ఈ-పట్టాదారు పాసుపుస్తకాల జారీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు.30 నెలల్లో రైతులపై రూ. 1.70 లక్షల కోట్ల ఖర్చుసభలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి, రైతులను రాజును చేయాలన్న ఆలోచనతోనే గడిచిన 30 నెలల్లో వ్యవసాయ రంగంపై రూ. 1 లక్ష 70 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. రైతు భరోసా కింద 30 నెలల్లో రూ. 36,135 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, గత ఏడాది జూన్‌లోనూ 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేసినట్లు గుర్తు చేశారు. "ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదు. రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే మా ఆశయం" అన్నారు.రైతు భరోసా, రుణమాఫీ, బీమా, గిట్టుబాటు ధర, సన్నవడ్లకు బోనస్, ఉచిత కరెంట్, నష్టపరిహారంలి వంటి అన్ని సంక్షేమ పథకాల కోసం ప్రతి నెలా సగటున రూ. 5,500 కోట్లులి ఖర్చు చేస్తున్నామని వివరించారు.గత పథకాలు కొనసాగిస్తూ కొత్త సంక్షేమంప్రభుత్వం ఏర్పడిన నాటికి రాష్ట్రంపై రూ. 8.11లక్షల కోట్ల అప్పు ఉన్నా, సమర్థంగా పాలన సాగిస్తూ గత ప్రభుత్వ పథకాలతో పాటు కొత్త సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు.షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, రేషన్



కార్డులు, సన్నబియ్యం, 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, మహిళా సంఘాలకు 1000 బస్సులు, బ్యాంక్ లింకేజీతో రూ. 60 వేల కోట్ల రుణాలు, ఇందిరమ్మ చీరలు, 67,717 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలి వంటి పథకాలు అందిస్తున్నామని తెలిపారు.రైతు భరోసాను ఎకరాకు రూ. 12 వేలకు పెంచామని, 30 నెలల్లో రూ. 80 వేల కోట్ల వడ్లను కొనుగోలు చేశామన్నారు. మొక్కజొన్న రైతుల కోసం రూ. 3,504 కోట్లు విడుదల చేశామని చెప్పారు.2029 నాటికి స్థానాలు పెరుగుదల2029 మే, జూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని, అప్పటికి రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు, శాసనసభ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని సీఎం అంచనా వేశారు.ప్రజా ప్రభుత్వంలో మంత్రులు రోజుకు 18 గంటలు పనిచేస్తారని, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలు, రైతులు, విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేసి తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా నిలబెడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరిలితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన కలిగి ఉండాలి: షీ టీమ్ ఎస్ఐ యాదగిరి

వరంగల్ ప్రతినిధి, జూలై 10 (వార్తా నిర్భయం)

మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అప్రమత్తతతో వ్యవహరిస్తే మహిళలపై జరిగే నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని వరంగల్ షీ టీమ్ ఎస్ఐ యాదగిరి అన్నారు. హనుమకొండలోని రెడ్డి కాలనీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో సుమారు 60 మంది విద్యార్థినులకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, టీ-సేఫ్ (౧-ఘుటవ) యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ యాదగిరి మాట్లాడుతూ, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో వ్యక్తిగత ఫొటోలు, సమాచారం పంచుకునేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు.మహిళలు ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో టీ-సేఫ్ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ఆ యాప్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం త్వరగా పొందవచ్చని తెలిపారు. ఉద్యోగాలు చేసే మహిళలు తమ కార్యాలయాల్లో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.మహిళలపై ఎలాంటి వేధింపులు జరిగినా ధైర్యంగా షీ టీమ్‌ను సంప్రదించాలని, సైబర్ నేరాలకు సంబంధించి టోల్‌ఫ్రీ 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అలాగే సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, షీ టీమ్ సీఐ వాట్సాప్ నంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నంబర్ 8712685270లకు




కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి, నేరస్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు జితేందర్, పద్మావతి, షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ రాంరెడ్డి, మహిళా కానిస్టేబుల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో అవినీతి, భూకబ్జాలు,

**30 నెలల్లో వనపర్తిలో రూ.2,147 కోట్ల అభివృద్ధి.**

**13,167 మందికి రూ.79.89 కోట్ల సంక్షేమ ఆర్థిక సాయం.**

**సంక్షేమ పథకాల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**





వనపర్తి బ్యూరో, జులై 10 (వార్త నిర్భయం) ప్రజా సంక్షేమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, గత 30 నెలల్లో వనపర్తి నియోజకవర్గంలోరూ.2,147 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 17వ విడత ముఖ్యమంత్రి సహాయనిధి, కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.13,167 మందికి రూ.79.89 కోట్ల సాయం2026 జూలై 10 నాటికి వనపర్తి నియోజకవర్గంలో మొత్తం 13,167 మంది లబ్ధిదారులకు రూ.79.89 కోట్లు ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు అండగా నిలుస్తోందని, ఇప్పటివరకు 7,371 మందికి రూ.18.05 కోట్లులి మంజూరు చేశామని తెలిపారు. తాజాగా 283 మందికి రూ.1.04 కోట్లలి చెక్కులు పంపిణీ చేశారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు అండగా, ఇప్పటివరకు 5,385మందికి రూ.53.91 కోట్లులిఅందించామన్నారు. తాజాగా 347 మందికి రూ.3.47 కోట్ల చెక్కులు ఇచ్చారు. అత్యవసర వైద్య చికిత్స కోసం 411 మందికి రూ.7.92 కోట్లు మంజూరు చేశామని, తాజాగా 72 మందికి రూ.1.45 కోట్లు అందించామని చెప్పారు.వనపర్తి పట్టణంతో పాటు వనపర్తి, పెద్దమందడి, ఖిల్లాఘనపురం, గోపాల్పేట, రేవల్లి, ఏదుల, శ్రీరంగాపూర్, పెబ్బేరు మండలాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా చెక్కులు అందజేశారు.వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల పెద్ద జీతగాడిలా పనిచేస్తున్నానని, గ్రామాలు--పట్టణాల సమగ్రాభివృద్ధితో పాటు ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నానని అన్నారు.రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఆరోగ్య సేవల బలోపేతం, ఇందిరమ్మ మహిళా శక్తి వంటి పథకాలు ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తెస్తున్నాయని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పాలనలో అవినీతి, భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్ వంటి చర్యలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు. ప్రజలే ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించి ఇంటికి పంపించారన్నారు. తెలంగాణను భారీ అప్పులపాలు చేసిన గత ప్రభుత్వానికి భిన్నంగా, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్థిక క్రమశిక్షణతో సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.అభివృద్ధి--సంక్షేమం రెండింటినీ సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తూ వనపర్తిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికార సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ముఖ్య నాయకుల సమావేశంలో మడిపడిగ చంద్రశేఖర్ పిలుపు**



వరంగల్ ప్రతినిధి జూలై 10 (వార్త నిర్భయం): బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మడిపడిగ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బీఎస్పీ తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు యెస్,డి,సాదిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ పార్లమెంట్ ముఖ్య నాయకుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బస్కె నాగరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మడిపడిగ చంద్రశేఖర్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బహుజన రాజ్యాధికార సాధన కోసం పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అక్టోబర్ 9న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న బహుజన్ సమాజ్ పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయడం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామం, మండలం నుంచి భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించి సభను విజయవంతం చేయాలని, ఇప్పటి నుంచే విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జన్ను అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వస్కుల ప్రవీణ్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వనం మహేందర్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు పోలపాక శ్రీధర్, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇసంపెల్లి గోవర్ధన్, నర్సంపేట నియోజకవర్గ అధ్యక్షుడు అలెగ్జాండర్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఆడ్లూరి సమ్మయ్య, పోలపాక లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో తొలి హైడ్రోజన్ ట్రైన్..

**ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం.. డేట్ ఫిక్స్..**

దేశంలో తొలి హైడ్రోజన్ రైలు రాబోతుంది. ఈ మేరకు రైల్వేశాఖ ముహూర్తం ఫిక్స్ చేసింది. జులై 17వ తేదీన ఈ రైలును ప్రధాని మోదీ ప్రారంభించనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఈ రైలుకు రైల్వేశాఖ ఆమోదం తెలిపింది. దీంతో త్వరలోనే పట్టాలెక్కి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.దేశ రైల్వే చరిత్రలో మరో నూతన శకం మొదలుకానుంది. తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ చేసింది. ఈ మేరకు ప్రారంభ తేదీని రైల్వేశాఖ అధికారికంగా ప్రకటించింది.